క్లుప్తంగా

ఆత్మీయ వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న ఏఎన్ఎంలను సన్మానిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

ఐరాల: ఉద్యోగం నిబద్ధతో పనిచేసినప్పుడు ఆ వ్యక్తిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్తోందని కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతిసింధూర, రాజేశ్వరి తెలిపారు. కాణిపాకం పీహెచ్‌సీలో ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న కవిత, హేమ, అంజలి, భువనేశ్వరి, హరిత, నాగరాణికి గురువారం పీహెచ్‌సీలో ఆత్మీయ వీడ్కోలు ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ వీరంతా ఉన్నతాధికారుల ఆదేశాలను గౌరవిస్తూ తమ కర్తవ్యాన్ని నిర్వహించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని.. ఎక్కడ పనిచేసినా ప్రజలకు సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ వేదవతి, ఎంపీహెచ్ఈఓ శివయ్య, ఎంపీహెచ్ఓ సిరాజుద్దీన్, సబ్ యూనిట్ ఆఫీసర్ భానుప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

యాదమరి: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ జడ్జి భారతి అన్నారు. గురువారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, వీఆర్‌ఓలకు న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉంటే ఎలాంటి నేరాలకు ఏఏ శిక్షలు అమలవుతాయో తెలుస్తుందన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్పెంటర్ అసోసియేషన్ వారికి భూమి కేటాయింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. వారికి ప్రస్తుత చట్టాలపై ఉన్న స్థితిగతులను వివరించారు. అనంతరం అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ పార్థసారథి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు అనుమతి ఇవ్వండి



సీఐ శ్రీనివాసులుకు కృష్ణాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న కమిటీ సభ్యులు

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటూ గురువారం నిర్వాహకులు సీఐ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని సమర్పించారు. స్థానిక రాజావీధిలో ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు త్రైతసిద్ధాంతం – ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక బంగారుపాళెం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వేడుకలకు సిబ్బంది హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న యువకుడు

గంగవరం: మండలంలోని దండపల్లి వైఎస్సార్ జంక్షన్‌లో గురువారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంలో దండపల్లి వైఎస్సార్ జంక్షన్‌లో రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో బెంగళూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో బైక్ వెనుక కూర్చున్న వినాయక(18) కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

మెరుగైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం



సిబ్బందితో ఎస్ఈ ఇస్మాయిల్

నదుం: జిల్లాలోని వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎస్ఈ ఇస్మాయిల్ తెలిపారు. ఆయన గురువారం బలిజపల్లె సబ్ స్టేషన్‌లో రూ.కోటిన్నరతో ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. బలిజపల్లె సబ్ స్టేషన్ పరిధిలో అధిక లోడ్ నియంత్రణకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈలు శ్రీనివాసమూర్తి, బాబు, డీఈఈ నరేంద్ర, ఏఈలు చంద్రశేఖర్, హేమచంద్ర పాల్గొన్నారు.

కుంటలు కాదు.. రోడ్లే



బంగారుపాళెం:రాగిమానుపెంట రహదారిపై నిలిచిన నీరు



గుంతలమయంగా మారిన గుంతూరు రోడ్డు

- చిన్నపాటి వర్షాలకే కుంటలను తలపిస్తున్న గ్రామీణ రోడ్లు
- రోడ్లపై గుంతల్లో నిల్వ ఉన్న వర్షపునీరు
- అవస్థలు పడుతూ ప్రయాణం..

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంతాల రోడ్లు ఇటీవల కురిసిన మోస్తరు వర్షానికి కుంటలను తలపిస్తున్నాయి. మండలంలోని బంగారుపాళెం–రాగిమానుపెంట రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్తులు అవస్థలు పడుతూ బురదరోడ్డులో రాకపోకలు సాగిస్తున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు రహదారులు గుంతలమయమయ్యాయి. వర్షపు నీరు నిల్వ ఉండడంతో రోడ్లు మడుగులను తలపిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని బంగారుపాళెం నుంచి రాగిమానుపెంట రోడ్డు మార్గంలో 20 గ్రామాలకు చెందిన గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానంగా మారడంతో బస్సులు, ఆటోలు, కార్లు, ద్విచ క్రవాహనాలపై ప్రయాణాలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలమయంగా ఉన్న బంగారుపాళెం–రాగిమానుపెంట రోడ్డును బాగుచేయాలని పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు నిట్టూరుస్తున్నారు. మూడు నెలల కిందట రాగిమానుపెంట గ్రామస్తులు గుంతల రోడ్డులో వరినాట్లు వేసి నిరసన కూడా తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఎన్‌పీసీ కాలనీ వద్ద నిలిచిన వర్షపు నీరు

వర్షం వస్తే ఇంతే..



చిత్తూరు అగ్నిమాపక కార్యాలయంలో రోడ్డులో వర్షపునీరు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని అగ్నిమాపక, అటవీశాఖ కార్యాలయం వద్ద కొద్దిపాటి వర్షం పడినా మురుగ నీరు అలాగే నిల్వ చేరుతోంది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి అగ్నిమాపక కార్యాలయం ముందు నీరు అలాగే చేరింది. దీంతో అటువైపుగా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. దీనికి తోడు అటువైపుగా వెళ్లే స్థానికులకు తిప్పలు పడుతున్నారు. నీరు నిల్వ చేరకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తల్లిపాలతోనే బిడ్డల ఆరోగ్యం



బంగారుపాళెం: బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యాన్ని తెలియజేస్తున్న సూపర్‌వైజర్లు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని బంగారుపాళె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు కవిత, ఫామిదాబేగం మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని.. బాలింతలు పాలు, పండ్లు, ఆకుకూరలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పోతపాలుతో పిల్లల ఎదుగుదల అంతంత మాత్రమే ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకల్లో మాజీమంత్రి పెద్దిరెడ్డి



కాబోయే వధూవరులను మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కాణిపాకం: కాణిపాకంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం మాజీ డీసీసీబీ చైర్మన్ రెడ్డెమ్మ కుమారుడు నిశ్చితార్థ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలు మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, వెంకటేగౌడ, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులకు ఆరోగ్య సూచనలు



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రెడ్డెప్ప

ఐరాల: హైరిస్క్ గర్భిణులు వైద్యుల సలహా మేరకు అవసరమైన అన్ని పరీక్షలు విధిగా చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. గురువారం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు రక్తహీనత నివారించవచ్చన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమన్నారు. గర్భస్థ సమయంలో అవసరమైన స్కానింగ్ పరీక్షలతో పాటు ముఖ్యంగా ఎన్‌టీ, టీఐఎఫ్ఎఫ్ఏ స్కానింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకుని అక్కడ అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం 34 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఇందులో 16 మంది హైరిస్క్ గర్భిణులుగా గుర్తించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎంపీహెచ్ఏ మునిరత్నం, ల్యాబ్ టెక్నీషియన్ అజార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కాణిపాకంలో పలువురు ప్రముఖులు



కాణిపాకం ఆలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, సమన్వయకర్త విజయానందరెడ్డి

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో పండితులు వారికి ఆశీర్వచనాలు అందించి ప్రసాదాలు అందజేశారు.

అంటువ్యాధులు సోకకుండా అవగాహన



జొన్నగురకలలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



నలిశెట్టిపల్లెలో గర్భిణి ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: గ్రామాల్లో అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని జొన్నగురకలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. వర్షాకాలంలో జ్వరాలు సోకకుండా వేడి చేసి చల్లార్చిన నీరు తాగాలన్నారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

నలిశెట్టిపల్లెలో వైద్యసేవలు

మండలంలోని నలిశెట్టిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు, 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులకు రక్తహీనత రాకుండా చూసుకోవాలన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమం అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు



నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: నగరంలో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మేయర్ అముద అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగరంలో.. గురువారం మేయర్, కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, నగరపాలక అధికారులు నగరంలోని ఎమ్మెస్సార్ సర్కిల్, పలమనేరు రోడ్డు, పాత బస్టాండ్ ప్రాంతాల్లో మేజర్ డ్రైన్లను పరిశీలించారు. ప్రధానంగా వర్షాలు కురిసినప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి ఎమ్మెస్సార్ సర్కిల్ వద్ద ఉన్న కల్వర్టుకు ఎక్కువగా నీరు రావడంతో నీరు రోడ్డుపైకి వస్తుందన్నారు. ఇక్కడికి నీటి ప్రవాహం తగ్గించేందుకు ప్రత్యామ్నాయ చర్యలపై చర్చించారు. ఇందుకోసం దర్గా సర్కిల్ నుంచి వచ్చే నీటిని ఎమ్మెస్సార్ వైపు రాకుండా మళ్లించేందుకు వీలుగా మరొక కల్వర్టరు నిర్మించాలని, ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెస్సార్ సర్కిల్ వద్ద కల్వర్టును మరింత పెద్దదిగా చేయడంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడానికి వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా.పి.లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఏఈ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ విస్తృత తనిఖీలు

వర్షాల నేపథ్యంలో కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ నగరంలో విస్తృతంగా పర్యటించి పలు కాలనీలు, మేజర్ కాలువలను పరిశీలించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరడం, మేజర్ డ్రైన్లను, ఇతర మురుగునీటి కాలువల్లో పరిస్థితిపై తనిఖీలు నిర్వహించారు. గురువారం వేకువజామున కురిసిన వర్షానికి నగరంలో పలు ప్రాంతాల్లో నీరు నిలిచింది. రామ్ నగర్ కాలనీ 'ఏ క్లాస్'లో వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. వర్షపు నీటిలోనే వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వర్షపు నీరు నిలవకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులతో చర్చించారు. వర్షపు నీరు సులభంగా వెళ్లేలా రెండు కల్వర్టర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డీఈ రమణను ఆదేశించారు.

ఆర్టీసీ బస్సులు ఆపాలని ధర్నా



రోడ్డుపై బస్సులను అడ్డుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

చౌడేపల్లె: చౌడేపల్లె– పుంగనూరు మార్గంలోని ఠాణా కొత్తయిండ్లు బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలని కోరుతూ గ్రామస్తులు గురువారం ధర్నా చేశారు. గతంలో బస్టాప్ వద్ద పాపిశెట్టిపల్లె, ఠాణా కొత్తయిండ్లకు చెందిన వారికి సౌకర్యంగా గతంలో బస్టాప్ వద్ద బస్సులు ఆపేవారు. ప్రస్తుతం ఆపడం లేదు. దీంతో ఆయా గ్రామస్తులు తీవ్ర ఇబ్బదులు పడుతున్నారు. అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదు. ఈ క్రమంలో ఆగ్రహించిన గ్రామస్తులు గురువారం ఆర్టీసీ బస్సులను అడ్డుకుని డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్ స్తంభించడంతో సమాచారం అందుకున్న సీఐ రాంభూపాల్ ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు

పుంగనూరు: స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 25 మంది ఎన్‌సీసీ 35ఏ బెటాలియన్ విద్యార్థులకు గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ సోమరాజు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. అంతేగాక ఈ సర్టిఫికెట్లు పొందిన వారికి పోటీ పరీక్షల్లో రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు.

10 నుంచి ఆరాధనోత్సవాలు

పలమనేరు: పట్టణ సమీపంలో వున్న రాఘవేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి 12 వరకు స్వామి వారి 354వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు మోహనక్రిష్ణ తెలిపారు. ఈ నెల 10న పూర్వారాధన, 11న మధ్య ఆరాధన, 12న ఉత్తరాధన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

రాష్ట్రంలో సుపరిపాలన శుద్ధ అబద్ధం

- అనంతాపురంలో రీకాలింగ్ చంద్రబాబుస్–మేనిఫెస్టో కార్యక్రమం



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సుపరిపాలన పేరుతో కూటమి తెచ్చిన సూపర్‌సిక్స్ శుద్ధ అబద్ధమని జెడ్పీటీసీ ఎంఎస్ బాబు నాయుడు తెలిపారు. చిత్తూరు మండలం అనంతాపురం గ్రామంలో గురువారం జెడ్పీటీసీ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబుస్–మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అంటేనే మోసం, అబద్ధమని విమర్శించారు. రాష్ట్రంలో ఏ గడపకు వెళ్లినా వైఎస్ జగన్ అంటే సంక్షేమం, చంద్రబాబు అంటే మోసం, అబద్ధపు హామీలే అంటున్నారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకుండా కాలక్షేమం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. సీఎం చంద్రబాబు ఎన్నికలప్పుడు తప్పుడు హామీలు ఇచ్చి గెలిచారనే విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసి రాష్ట్రాన్ని దోచేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రజాసంక్షేమానికి తూట్లు పొడుస్తున్నారని వారు ఆరోపించారు. చివరలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జయపాల్, వైస్ ఎంపీపీ జయరాం, ఎంపీటీసీ సుదర్శన్, ప్రతిమారెడ్డి, నాయకులు త్యాగరాజులు, భాస్కర్‌రెడ్డి, రాజేంద్రన్, తులసి, భాస్కర్‌నాయుడు, రవినాయుడు, గోవిందనాయుడు, హేమంత్‌నాయుడు, స్టాండ్లీ, మురగ, రాబర్ట్, ప్రభాకర్, ధర్మారెడ్డి, దిలీప్, కన్నయ్యనాయుడు, పీటర్, పట్టాభి, రాజా, భాస్కర్, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కీలపట్లలో సౌభాగ్యం



సౌభాగ్యం కార్యక్రమం పోస్టర్

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా సౌభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర తెలిపారు. ఇందులో భాగంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మహిళలకు కుంకుమ, గాజులు, పూలు, పసుపు దారం, కంకణాలు అందజేస్తామని పేర్కొన్నారు. సౌభాగ్యం కార్యక్రమాన్ని ఆలయంలో మొట్టమొదటగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.